ముందస్తు ప్రణాళికలో ప్రభుత్వ విఫలం

- పంటలు పరిశీలించిన ఎంపీ ధర్మపురి అరవింద్

నవతెలంగాణ-ఆర్మూర్

గత కొద్ది రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని ముందస్తు ప్రణాళికలు చేపట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. శనివారం మండలంలోని పిప్రి, ఫతేపూర్ గ్రామాలలో వడగళ్ల వానతో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. జిల్లా పార్లమెంటులో 40,000 ఎకరాలలో వరి ,నువ్వులు, మామిడి పంటలు దెబ్బతిన్నవని, ఆర్మూర్ ప్రాంతంలో టమాట కొత్తిమీర అన్ని పంటలు దెబ్బతిన్నవని అన్నారు. రైతులు బాధల్లో ఉంటే ముఖ్యమంత్రి కేసీఆర్ ఔరంగాబాద్ సభలో తూలుతున్నాడని, ఈ రాష్ట్రంలో ఫసల్ బీమా లేదని పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని అన్నారు. గత తొమ్మిది సంవత్సరాలలో ఏ పంటకు బోనస్ ఇవ్వలేదని అన్నారు .తక్షణమే 50వేల రూపాయలు ఎకరానికి చెల్లించాలని డిమాండ్ చేస్తున్నట్టు తెలిపారు.

అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి

ఆదివారం 30 ఏప్రిల్ 2023

నేడు ప్రవేశ పరీక్ష

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మహాత్మా జ్యోతి బాపూలే విద్యా సంస్థలలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు నేడు(ఆదివారం) పరీక్ష నిర్వహించనున్నట్టు విద్యాసంస్థల రీజనల్ కోఆర్డినేటర్ సత్యనాథ్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెసిడెన్సియల్ జూనియర్, డిగ్రీ ప్రవేశ పరీక్షల ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు నిర్వహించనున్నట్టు తెలిపారు. కావున అభ్యర్థులందరూ సమయానికంటే ముందే హాజరుకావాలని సూచించారు. ఆర్‌జేసీకి 12 పరీక్ష కేంద్రాలు, ఆర్‌డీసీ కి మూడు కేంద్రాలను కేటాయించినట్టు తెలిపారు.

పక్కా కమర్షియల్

ఆగని అమ్మ కడుపు కోతలు

- ప్రయివేటులో 80 శాతానికి పైగా ఆపరేషన్లు
- పాత కలెక్టర్ నారాయణరెడ్డి కృషి వృథా
- సిజేరియన్లపై నాడు ఎప్పటికప్పుడు సమీక్ష
- 'లైట్' తీసుకుంటున్న అధికార యంత్రాంగం
- తల్లిబిడ్డల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం
- పట్టించుకోని డీఎంహెచ్ఓ కార్యాలయం

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

జీవితంలో అమ్మవడం ఓ గొప్పవరం.. కానీ ఆ అమ్మతనాన్ని కూడా జిల్లాలో ప్రయివేటు ఆసుపత్రులు పక్కా కమర్షియల్‌గా మార్చాయి. తల్లి తన బిడ్డకు జన్మనిచ్చే ప్రసవాన్ని పైసల ఆటగా మార్చారు. చాలా ఆరోగ్యకరమైన, ప్రశాంత వాతావరణంలో జరగాల్సిన కాన్పులను.. ఆపరేషన్ థియేటర్లలో, గంభీరమైన, ప్రతిక్షణం ఆందోళన పరిస్థితుల్లో చేస్తున్నారు. తల్లిబిడ్డల ఆరోగ్యం కోసం సాధారణ కాన్పులు చేయాలని ప్రయివేటు ఆసుపత్రులకు పాత జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి జారీ చేసిన ఆదేశాలు.. ఆయన బదిలీతో బుట్టదాఖలయ్యాయి. ఆ సమయంలో ప్రతి ఆపరేషన్‌పై సమీక్షలు నిర్వహించారు. అనవసర ఆపరేషన్లు చేసిన ఆసుపత్రులకు నోటీసులు జారీ చేసేందుకు సైతం వెనకాడలేదు. ఆ సమయంలో జిల్లాలో సాధారణ ప్రసవాలు పెరిగాయి. కానీ పాత కలెక్టర్ బదిలీతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. ప్రస్తుత కలెక్టర్ అటువైపు దృష్టి సారించకపోవడం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అమ్యామ్యాలకు అలవాటుపడటంతో ప్రయివేటు ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు 15 శాతం కూడా జరగడం లేదు. అదే సమయంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో మాత్రం 45 శాతం వరకు సాధారణ ప్రసవాలు జరగడం విశేషం.



నిజామాబాద్ జిల్లాలో ప్రయివేటు ఆసుపత్రులు ప్రసవాలకు మళ్లీ ఆపరేషన్ బాట పట్టాయి. ఓ వైపు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ కాన్పుల కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశారు. గర్భిణీలకు మొదటి నుంచి సాధారణ ప్రసవంపై అవగాహన కల్పిస్తున్నారు. సాధారణ కాన్పు జరిగితే జరిగే ఆరోగ్య ప్రయోజనాలతో పాటు సిజేరియన్ జరిగితే తలెత్తే దుష్ప్రరిణామాలు సైతం వివరిస్తున్నారు. దీంతో గర్భిణులు సాధారణ ప్రసవానికి మానసికంగా సిద్ధమవుతున్నారు. ఆ తరువాత ప్రసవాల సమయంలోనూ ఇబ్బందులు తలెత్తడం లేదు. కానీ ప్రయివేటు ఆసుపత్రుల్లో దీనికి పూర్తి విరుద్ధంగా జరుగుతోంది. పాత కలెక్టర్ ఆదేశాలతో సాధారణ ప్రసవాల వల్ల కలిగే ప్రయోజనాలపై ఓ స్టిక్కర్‌ను అతికించి మమ అనిపించారు. కానీ ఆచరణలో మళ్లీ ఆపరేషన్ల బాటపడుతున్నారు. ఈ యేడాది జనవరి నుంచి మార్చి వరకు మూడు నెలల్లో జరిగిన ప్రసవాల లెక్కలు పరిశీలిస్తే.. ప్రయివేటులో సాధారణ ప్రసవాల సంఖ్య భారీగా తగ్గింది. జనవరిలో 14 శాతం, ఫిబ్రవరిలో 15, మార్చిలో 11 శాతం మాత్రమే సాధారణ కాన్పులు జరిగాయి. అదే ప్రభుత్వ ఆసుపత్రుల్లో జనవరిలో 39.43 శాతం, ఫిబ్రవరిలో 45.84, మార్చిలో 43.83 శాతం సాధారణ ప్రసవాలు అయ్యాయి.

సమీక్షలు కరువు...

గతంలో కలెక్టర్ నారాయణరెడ్డి ఉన్న సమయంలో ప్రతి ఆపరేషన్‌కు సంబంధించి కేస్ ఫైల్ తెప్పించుకుని స్టడీ చేశారు. అనవసరంగా ఆపరేషన్ చేసినట్టు భావించిన గర్భిణులకు సంబంధించి ఆయా ఆసుపత్రులకు షోకాజ్ నోటీసులు సైతం జారీ చేశారు. కానీ పరిస్థితి ఇప్పుడు ఇందుకు భిన్నంగా ఉంది. నారాయణరెడ్డి బదిలీ అయినప్పటి నుంచి ఇప్పటి వరకు వైద్యశాఖకు సంబంధించి సాధారణ ప్రసవాలపై సమీక్ష సమావేశం జరగలేదు. ప్రస్తుతం ఉన్న కలెక్టర్ ఇంకా పూర్తిస్థాయిలో ఆసుపత్రులపై దృష్టి సారించడం లేదు. ఫలితంగా మళ్లీ ఆపరేషన్లు పెరిగాయి.

ప్రభుత్వ ఆసుపత్రి

	సాధారణ	(శాతం)	సిజేరియన్	(శాతం)
జనవరి	457	39.43	702	60.56
ఫిబ్రవరి	436	45.84	535	55.09
మార్చి	459	43.83	588	56.16

ప్రయివేటు ఆసుపత్రి

	సాధారణ	(శాతం)	సిజేరియన్	(శాతం)
జనవరి	132	14.13	802	85.86
ఫిబ్రవరి	139	15.65	749	84.34
మార్చి	122	11.31	956	88.68

సమావేశం జరగలేదు : సుదర్శనం, డీఎంహెచ్ఓ

ప్రయివేటు ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు చేయాలని ఆదేశాలు జారీ చేస్తూనే ఉంటాం. మొదటి ప్రాధాన్యత దానికే ఇవ్వాలని చెబుతున్నాం. అయితే కలెక్టర్ నారాయణరెడ్డి బదిలీ అయిన తరువాత ప్రయివేటు ఆసుపత్రులతో మళ్లీ సమావేశం జరగలేదు.



మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి శ్రీసుధ

విత్తనాలతో నష్టపోతే రైతులు
నష్టపరిహారం పొందొచ్చు

- అగ్రీ లీగల్ ఎయిడ్ క్లీనిక్ ప్రారంభోత్సవంలో హైకోర్టు న్యాయమూర్తి శ్రీసుధా
- రసీదులు ఖచ్చితంగా తీసుకొని ఉంచుకోవాలని సూచన

నవతెలంగాణ-భిక్కనూర్

విత్తనాల కారణంగా పంట దిగుబడి ఆశించిన స్థాయిలో రాకపోతే రైతులు నష్టపరిహారం పొందే వీలుందని హైకోర్టు న్యాయమూర్తి శ్రీ సుధా అన్నారు. కామారెడ్డి జిల్లా భిక్కనూర్ రైతు వేదికలో శనివారం అగ్రీ లీగల్ ఎయిడ్ క్లినిక్ ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు చైతన్య సదస్సులో ఆమె రైతులను ఉద్దేశించి మాట్లాడారు. విత్తనాల వల్ల పంట నష్టం జరిగినట్లు రైతులు గుర్తిస్తే విత్తనాల కంపెనీ నుంచి పరిహారం పొందవచ్చని తెలిపారు. విత్తనాలు కొనుగోలు చేసిన సమయంలో ఇచ్చిన రసీదులు, కొన్ని విత్తనాల శాంపిల్, బ్యాచ్ నెంబర్ వంటి వివరాలను రైతుల వద్ద ఉంచుకొని ఫిర్యాదు చేయాలన్నారు. పురుగు మందులు పని చేయకపోతే వాటి బిల్లు, కంపెనీ వివరాలు రైతులు తమ వద్ద ఉంచుకొని ఫిర్యాదు చేస్తే తగిన పరిహారం పొందే వీలుంటుందని పేర్కొన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని నేరుగా మార్కెటింగ్ చేసుకోవాలని సూచించారు. ధాన్యాన్ని దళారులకు విక్రయించడం వల్ల గిట్టుబాటు ధర రాక రైతులు మోసపోతున్నారని చెప్పారు. సేంద్రీయ పద్ధతిలో రైతులు కూరగాయలు, ధాన్యం పండించి ఆన్‌లైన్ ద్వారా విక్రయిస్తే రైతులు గిట్టుబాటు ధర పొందే వీలుందని తెలిపారు.



అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి

అనంతరం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ రైతులు అగ్రీ లీగల్ ఎయిడ్ క్లినిక్ సేవలు వినియోగించుకోవాలని చెప్పారు. అకాల వర్షాల వల్ల జిల్లాలో జరిగిన పంట నష్టం వివరాల సేకరణ యుద్ధ ప్రతిపాదికన చేపడతామన్నారు. రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు. సమావేశంలో జిల్లా జడ్జి శ్రీదేవి, ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ వేణు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్, ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి, న్యాయమూర్తులు, న్యాయవాదులు, రైతులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు జీవనభృతి కల్పించాలి

- జాతీయ బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో నిరుద్యోగ తెలంగాణ దీక్ష



నిరుద్యోగ దీక్షలో నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి(తాడ్వాయి)

నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి, రుణాలు కల్పించి ఉద్యోగ నోటిఫికేషన్‌లు వేసి సక్రమంగా భర్తీ చేయాలని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు రాజీవ్‌కుమార్ డిమాండ్ చేశారు. జాతీయ బీసీ యువజన సంఘం కామారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో నిరుద్యోగ తెలంగాణ నిరసన దీక్ష కార్యక్రమం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట శనివారం నిర్వహించారు. ఈ దీక్షకు మద్దతుగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కాముని సుదర్శన్ నేత, ప్రధాన కార్యదర్శి అఖిల్ రావు, బహుజన ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు క్యాతం సిద్ధ రాములు, ఎంబీసీ జిల్లా అధ్యక్షులు విజయ్ కుమార్, బామ్ సేఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేందర్, బివిఎం విద్యార్థి నాయకులు విటల్ తదితరులు మద్దతు తెలిపారు.

వీడిన వివాహిత హత్య కేసు

- వివాహేతర బంధానికి ఒప్పుకోవడం లేదని దారుణ హతం

నవతెలంగాణ-కంఠేశ్వర్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ

నగరంలోని 4 వ టౌన్ పరిధిలోని బ్యాంక్ కాలనీలో ఓ ప్రైవేట్ వెంచర్ వద్ద అనుమానస్పద స్థితిలో చనిపోయిన వివాహితది హత్యగా పోలీసులు నిర్ధారించారు. వివాహేతర బంధానికి సహకరించడం లేదని ఓ యువకుడు దారుణానికి ఒడిగట్టాడు. కేసుకు సంబంధించి వివరాలను ఏసీపీ కిరణ్‌కుమార్ శనివారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ నెల 25న నగరంలోని పాంగ్రా బ్యాంక్ కాలనికి చెందిన సంగెం మల్లేష్ తన భార్య కస్తూరి(28) 22వ తేదీ రోజు పనికి వెళ్లి తిరిగి రాలేదని ఫిర్యాదు చేశాడు. అదే రోజు సాయంత్రం కుళ్ళి పోయిన శవం రమాదేవి వెంచర్ లోని ఖాళీ ఇంటిలోని బాత్రూం లో లభించింది. విచారణలో మృతురాలిని బ్యాంక్ కాలనీకి చెందిన సిరిగోయ అలియాస్ సిరికొండ శంకర్ ఆమెతో అక్రమ సంబంధం కొనసాగించాలని వేధించడంతో ఆమె తిరస్కరించింది. దీంతో కస్తూరికి ఫోన్ చేసి రమాదేవి వెంచర్ లోని ఖాళీ ఇంటికి రప్పించారు. అక్కడ ఆమె తలను గోడకేసి బాది, చేతులతో ఊపిరి ఆడకుండా చేసి హత్య చేసి ఆమె వద్ద గల సెల్ ఫోన్ తీసుకొని పారి పారిపోయినట్లు ఏసీపీ తెలిపారు. కస్తూరి సెల్ పోన్ కాల్ డాటా తో పాటు సిసి టివి ఫుటేజిల అధారంగా నిందితుడిని అరెస్ట్ చేసినట్టుతెలిపారు. ఈ కేసును ఛేదించిన నగర సిఐ వెంకట్ నారాయణ, ఎస్ఐ సందిప్ లను ఏసిపి అభినంధించారు.

నిజాంసాగర్, సింగూరుకు
6 వేల క్యూసెక్కుల నీరు

- మల్లన్నసాగర్ నుంచి నీటి విడుదల
- రెండు పంటలకు నీళ్లు

: స్పీకర్ పోచారం, ఎమ్మెల్యే షిండే

నవతెలంగాణ-నసురుల్లాబాద్





పనులు పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకుంటున్న స్పీకర్ పోచారం, ఎమ్మెల్యే షిండే తదితరులు

నిజంసాగర్, సింగూర్ ఆయకట్టు భూములను సస్యశ్యామలం చేసేందుకు మల్లన్న సాగర్ నుంచి ఆరువేల క్యూసెక్కుల నీరు వస్తుందని రాష్ట్ర శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శనివారం స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ షిండే, బాన్సువాడ నియోజకవర్గ బీఆరెస్ నేతలతో కలిసి సిద్దిపేట జిల్లాలోని మల్లన్న సాగర్ ను సందర్శించారు. అక్కడ జరుగుతున్న కాలువల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాంసాగర్ సింగూరు చివరి ఆయకట్టు సాగునీరు అందించడం కోసమై ఆరువేల క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు.

దీనివల్ల ఆయకట్టు కింద రెండు పంటలకు పుష్కలంగా నీరు లభిస్తాయని అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రపంచంలోనే అద్భుతమైన లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుగా గుర్తించబడుతున్న కాళేశ్వరం ద్వారా తెలంగాణ సస్యశ్యామలం అవుతుందన్నారు. ఇది సీఎం కేసీఆర్ స్వప్నమని అన్నారు. మల్లన్న సాగర్ కుడి కాలువ ద్వారా 11 వేల క్యూసెక్కుల నీరు కొండ పోచమ్మసాగర్ కు వెళుండగా ఆ నీరు ఇప్పటికే నిజాంసాగర్ లోకి వస్తున్నాయని తెలిపారు. మరో కాలువ ద్వారా 6 వేల క్యూసెక్కుల నీరు హల్దీ వాగు ద్వారా సింగూరు, నిజాంసాగర్‌లోకి వస్తాయన్నారు. దీంతో మెదక్, నర్సాపూర్, జుక్కల్, బాన్సువాడ ప్రాంతాల రైతులకు రెండు పంటలకు నీరందుతా యన్నారు. రైతులు ఆర్థిక పరిపుష్టిని సాధిస్తారని పేర్కొన్నారు. ఆయన వెంట జిల్లా రైతు బంధు అధ్యక్షుడు అంజిరెడ్డి, బాన్సువాడ మున్సిపల్ చైర్మన్ గంగాధర్, వైస్ చైర్మన్ జుబేర్, ఖంరు, మోహన్ నాయక్ ఉన్నారు.

గుడిసె వాసులకు జీవో 58 అమలు చేయాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొత్త నర్సింలు



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి నినాదాలు చేస్తున్న ప్రజలు

నవతెలంగాణ-భిక్కనూర్

గుడిసె వాసులకు ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఉంటున్న వారికి 58 జీవోను అమలు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొత్త నర్సింలు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 58,59 జీవోను అమలు చేసినప్పటికీ మీ సేవలో ఇంకా లోటుపాట్లు ఉన్నాయని, వాటిని సరిదిద్ది ఆ జీవోని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అర్జున్, ప్రవీణ్, బాబ్జాన్, నర్సింలు, బాలరాజ్, కవిత, లక్ష్మి, రుక్సానా, బాలమణి,పద్మా తదితరులు పాల్గొన్నారు.

తడిచిన ధాన్యం బాయిల్డ్ మిల్లులకు

- ఇప్పటి వరకు 1.64 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు పూర్తి
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లాలో యాసంగి 2022-23 సీజన్ లో ఇప్పటివరకు 406 కేంద్రాల ద్వారా 20,239మంది రైతుల నుండి 1,64,656 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలించినట్టు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. ధాన్యం సేకరణలో రైతులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. గ్రామ స్థాయిలో పీ.పీ.సి సెంటర్ ఇంచార్జ్ లను, వ్యవసాయ విస్తీర్ణాధికారులను, మండల స్థాయిలో మండల స్పెషల్ ఆఫీసర్లు, తహసీల్దార్లు, మండల వ్యవసాయ అధికారి, స్థానిక ఎస్.ఐ, ఎం.వీ.ఐ, డివిజన్ స్థాయిలో ఆర్డీఓ, వ్యవసాయ శాఖ ఏ.డీ, ఎం.వీ.ఐ, సూపర్వైజరీ ఆఫీసర్లు, ఏ.సీ.పీ, జిల్లా స్థాయిలో అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీలు ఏర్పాటు చేసి క్షేత్ర స్థాయి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లపై శనివారం సమీక్ష నిర్వహించారు.



మాట్లాడుతున్న కలెక్టర్

తడిచిన ధాన్యం.. బాయిల్డ్ మిల్లులకు..

రైతులు ఎఫ్.ఏ.క్యూ నిబంధనలకు అనుగుణంగా నాణ్యతా ప్రమాణాలతో కూడిన ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకువచ్చి పూర్తి స్థాయిలో మద్దతు ధర పొందాలని కలెక్టర్ కోరారు. అకాల వర్షాల కారణంగా తడిచిన ధాన్యాన్ని బాగా ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ఈ విషయంలో ప్రభుత్వం చొరవ చూపుతూ, తడిచిన ధాన్యాన్ని బాయిల్డ్ మిల్లులకు తరలించేలా ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఇప్పటివరకు 25 ట్రక్కుల తడిచిన ధాన్యాన్ని మిల్లులకు తరలించినట్టు తెలిపారు. కావున రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కాకుండా సంయమనం పాటించాలని కోరారు.

కద్తా పేరుతో కొర్రీలు పెట్టొద్దు

ఇదే అదనుగా చూసుకుని కొందరు రైస్ మిల్లర్లు కద్తా పేరుతో వచ్చిన టువంటి ధాన్యాన్ని దించుకోవ డానికి ఇబ్బందికి గురి చేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని కలెక్టర్ అన్నారు. నాణ్యమైన ధాన్యాన్ని కద్తా పేరుతో ఎవరైనా రైస్ మిల్లర్లు దోపిడీ చేయడానికి ప్రయత్నిస్తే, అలాంటి రైస్ మిల్లులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులను ఆదేశించామన్నారు. ధాన్యం దిగిన వెంటనే మిల్లులో అక్ నాలెడ్జ్ మెంట్ ఇవ్వాలని, పీపీసీ సెంటర్ ఇంచార్జ్ తో సమన్వయము చేసుకుంటూ కొనుగోళ్ల వేగవంతం చేయాల్సిందిగా జిల్లా అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు.

జిల్లాలో అన్ని సెంటర్లలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాల్సిందిగా అధికారులను ఆదేశించామని కలెక్టర్ తెలిపారు. డీపీఎంలు ఎంట్రీలను వేగవంతం చేసి రైతుల బ్యాంకు ఖాతాలలో ధాన్యం డబ్బులు జమ చేయాలని సూచించామన్నారు. ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు ఎప్పటికప్పుడు లారీలను పంపిస్తూ ధాన్యం తరలించాలని, ఈ ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్‌ను ఆదేశించామని తెలిపారు. అలాగే గన్నీ బ్యాగుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సివిల్ సప్లైస్ డీ.ఎం ను ఆదేశించామని తెలిపారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ రైతులకు సూచనలు చేస్తూ, ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని సూచించామన్నారు. ఏ దశలోనూ రైతులు ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించామని కలెక్టర్ తెలిపారు.



హాజరైన అధికారులు

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ



నవతెలంగాణ-నందిపేట్

మండలంలోని వెల్మల్ గ్రామంలో 25 మంది లబ్ధిదారులకు మంజూరైన కళ్యాణలక్ష్మీ చెక్కులను బీఆర్ఎస్ నాయకులు శనివారం పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పేదింటి ఆడపిల్లల వివాహాలకు సాయం చేస్తూ అండగా ఉంటున్నారని పేర్కొన్నారు. చెక్కులు తీసుకున్న లబ్ధిదారులు సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మచ్చర్ల సాయమ్మ, వైస్ ఎంపీపీ దేవేందర్, విజిలెన్స్ మానిటరింగ్ సభ్యులు రాజన్న, ఉప సర్పంచ్ ముప్పెడ నారాయణ, వార్డు సభ్యులు, గ్రామ అధ్యక్షుడు రాము, బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఎంపీటీసీ శ్రీధర్, రఫీ, పోతన్న, విజయ్, ప్రసాద్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం చుట్టూ సీసీ పోయించిన ఉపసర్పంచ్



నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని నాగేంద్రనగర్ గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ జాతర కొండ శేఖర్ తన స్వంత ఖర్చు రూ.25 వేలతో నాగేంద్రనగర్ గ్రామంలో గల అంబేద్కర్ విగ్రహం చుట్టూ సీసీ పోయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో సీఎం కేసీఆర్ 125 అడుగుల విగ్రహం కట్టారని, అదే స్ఫూర్తితో నా వంతుగా తమ గ్రామంలో గల అంబేద్కర్ విగ్రహం చుట్టూ సీసీ పోయించానని అన్నారు.

చెడగొట్టు వానలతో తీవ్ర నష్టం

- నష్టపోయిన రైతులకు పరిహారం ఎకరాకు రూ.30 వేలు చెల్లించాలి
- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్



మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్

నవతెలంగాణ-కంఠేశ్వర్

చెడగొట్టు వానలు కురియడం వలన రైతులకు పెద్దఎత్తున నష్టం వాటిల్లిందని, ప్రతి రైతుకూ నష్టపరిహారం రూ.30వేలు చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నాందేవ్‌వాడలో గల జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హార్వెస్టింగ్ చేసిన వడ్లు తడిచిపోయాయని, తడిసిన ధాన్యాన్ని యథాతదంగా కత్తిరింపులు లేకుండా కొనుగోలు చేసి కనీస మద్దతు ధరను అందించాలని, అలాగే పంటలు వడగండ్ల వానతో భారీ వర్షంతో నేలరాలిపోయాయని తెలిపారు. చేతికి రాకుండా పోయిన పంటలకు రైతుకు ఎకరానికి రూ.30వేలు నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్రంలో మరొక రైతు ఉద్యమం వస్తదని హెచ్చరించారు. దీంతోపాటు కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్రలు చేస్తున్నదని, అందుకే బడ్జెట్లో బాగా కేటాయింపులు తగ్గించిందన్నారు. అనేక రకాల కొత్త విధానం తీసుకొస్తూ రెండుసార్లు 333 జీవో ప్రకారం రెండుసార్లు ఫోటోలు తీయాలని, వాటిని అప్‌లోడ్ చేయాలనే విధానాన్ని తెచ్చి కనీస కూలి రాకుండా వ్యవసాయ కూలీలతో వెట్టి చాకిరి చేయించుకొనే పనిలో కేంద్ర ప్రభుత్వం పడ్డదని విమర్శించారు. ఉపాధి పని క్షేత్రాలలో కనీస సౌకర్యాలు లేకుండా ఉన్నాయన్నారు. అక్కడక్కడ అధికారులు వచ్చిన వాళ్లకు పని ఇవ్వకుండా, రాని వాళ్ళ పేర్లు రాసి డబ్బులని దొడ్డి దారిలో నొక్కేస్తున్నారని ఆరోపించారు. అందుకే బడ్జెట్లో రూ.2లక్షల 40 వేల కోట్లు పెంచి 100 నుంచి 200 రోజులకు పని పెంచాలని, ఎలాంటి నిబంధనలు లేకుండా రోజుకు రూ.600 కూలీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పని సందర్భంగా ఏదైనా కారణంతో చనిపోయిన వాళ్లకు 10 లక్షలు ఇవ్వాలని, వాళ్ళ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూమి లేని నిరుపేదలకు మూలుగుతున్న ప్రభుత్వ భూమిని పంచాలని, ఎస్సీ ఎస్టీలకు ఇస్తానన్న 3 ఎకరాల భూమిని వెంటనే అమలు చేయాలని, ఇల్లు లేని కూలీలకు ఇళ్ల స్థలం ఇచ్చి నిర్మాణం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చెరో 5 లక్షల చొప్పున 10 లక్షల రూపాయలు ఉచిత ఇంటి నిర్మాణ రుణం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో హడావుడిగా అనేక హామీలు ఇస్తారని, మళ్లీ పదవీకాలం పూర్తయ్యేముందు వచ్చే ఎన్నికలకు గాలం వేసే హామీలు కూడా ఇస్తారని, కానీ ఈ మధ్యకాలంలో హామీలను నెరవేర్చటం లేదన్నారు. ఈ విధంగా ప్రజల్ని మోసం చేయడం దుర్మార్గమని, ఎన్నికలలో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలని, లేనిచో వచ్చే ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలని హెచ్చరించారు. జిల్లా అధ్యక్ష - ప్రధాన కార్యదర్శులు ఏశాల గంగాధర్, పెద్ది వెంకట్రాములు, జిల్లా ఉపాధ్యక్షులు లింగం, నర్ర శంకర్, జిల్లా కమిటీ సభ్యులు గోళం లక్ష్మి గోవర్ధన్, కళ, రాజేశ్వరి, సాయిలు, నరసయ్య, సావిత్రి, లక్ష్మీనరసయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

- అలరించిన లైజీం నృత్యాలు



ఊరేగింపు ప్రారంభిస్తున్న ఎస్ఐ

నవతెలంగాణ-బోధన్

సాలూర మండల కేంద్రంలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత కాలనీ నుంచి సాలూర బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం వరకు ప్రత్యేక రథంలో అంబేద్కర్ చిత్రపటం ఊరేగిస్తూ మహిళలు హారతులతో తరలి వచ్చారు. బోధన్ రూరల్ ఎస్ఐ సందీప్ జెండా ఊపి ఊరేగింపు ప్రారంభించారు. అలాగే మహారాష్ట్ర కళాకారులు అంబేద్కర్ పాటలకు లయబద్ధంగా చేసిన లైజీం నృత్యాలు గ్రామస్థులను ఆకట్టుకున్నాయి. అనంతరం భజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు రాహుల లక్ష్మణ్, రాజేందర్, సరిడె సాయిలు, సాలేన్ సంజీవ్, సింగడి పాండు, కిషన్, రిటైర్డ్ ఎంపీడీఓ సాయప్పా, బాలయ్య, బ్యాంకు సాయిలు, దత్తు, చంటి, సుభాష్ కాలనీవాసులు పాల్గొన్నారు.

దుబ్బాక నుంచి సికింద్రాపూర్ రోడ్డుకు మహర్దశ



రోడ్డును పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-ధర్పల్లి

దుబ్బాక నుంచి సికింద్రాపూర్ రోడ్డుకు మహర్దశ లభించింది. అనేక సంవత్సరాలుగా గ్రామస్థులకు ఈ రోడ్డు చిత్తడిగా మారుతుండటంతో అనేక ఇబ్బందులు ఎదురయ్యేవి. రైతులకు పంటపొలాలకు వెళ్లే రహదారితో పాటు దుబ్బాక గ్రామస్థులకు సికింద్రాపూర్ వెళ్లేందుకు సులువుతో పాటు చాల దగ్గరి ప్రయాణమని దుబ్బాక ఉప సర్పంచ్ పిప్పెర ప్రతాప్‌గౌడ్ అన్నారు. ఏండ్ల నుంచి ఉన్న రోడ్డు సమస్యను ఇటీవల రూరల్ ఎమ్మెల్యే దృష్టికి గ్రామస్థులు తీసుకెళ్లగా స్పందించిన ఎమ్మెల్యే శనివారం సంబంధిత అధికారులకు పంపించారు. ఆరు కిలోమీటర్ల రహదారి వర్షం పడితే చిత్తడిగా మారిందని రోడ్డును అధికారులు పరిశీలించి నివేదిక తయారు చేశారు. త్వరలో ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టితో ఇన్నాళ్లకు రోడ్డుకు దశ వచ్చిందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేష్, ఎంపీటీసీ గంగాధర్, గ్రామ అధ్యక్షుడు కొతి శేఖర్‌రెడ్డి, గ్రామాభివృద్ధి అధ్యక్షుడు నూకల అశోక్, వార్డు మెంబర్ గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

మనుషా, ఆకాష్ చదువు బాధ్యత తీసుకున్న సునీల్‌రెడ్డి



బాధితులను పరామర్శిస్తున్న సునీల్‌రెడ్డి

నవతెలంగాణ-మెండోరా

మండలంలోని పోచంపాడ్ ఆమ్రాయ్ కాలానికి చెందిన ధర్మపాల్-శకుంతల దంపతులు వారికి మనుషా, ఆకాష్ అనే కొడుకు కూతురు ఉన్నారు. ధర్మపాల్ కొన్ని సంవత్సరాల క్రితం మరణించాడు. ఇటీవల కాలంలో శకుంతల కూడా మరణించారు. ధర్మపాల్-శకుంతల వారి కుటుంబం నిరుపేద కుటుంబం కావడంతో మనుషా, ఆకాష్‌లు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్‌రెడ్డి వారి కుటుంబాన్ని శనివారం పరామర్శించి ధైర్యం చెప్పారు. మనుషా, ఆకాష్‌ల చదువు బాధ్యతలను తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఇలాంటి కుటుంబాలను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. వారితో పాటు సునీల్ యువసేన సభ్యులు ఉన్నారు.

పీఎంశ్రీ పథకానికి ఎంపిక పట్ల గ్రామస్తుల హర్షం

నవతెలంగాణ-ముప్కాల్

పీఎంశ్రీ పథకం (ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా)కు మండలంలోని వేంపల్లి ప్రాథమిక పాఠశాల ఎంపికైన సందర్భంగా గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని వేంపల్లి ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు స్థానిక విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలోనే విద్యను అభ్యసిస్తున్నారు. విద్యార్థులకు నైపుణ్యమైన విద్యను అందించేందుకు గ్రామస్తులు అంతా ఒక్కటై ప్రాథమిక పాఠశాలలోనే విద్యార్థులు ఇంగ్లీష మీడియం విద్యను అభ్యషించాలని కోరుతూ గ్రామస్తులంతా కలిసి తీర్మానం చేశారు. చిన్న పిల్లలకు అందుబాటులో ఎల్కెజీ, యూకెజీ క్లాసులు సైతం ఏర్పాట్లు చేశారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 255 మంది ఉండగా, అందుకోసం నలుగురు ప్రయివేటు ఉపాధ్యాయులను గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. గ్రామం నుంచి ఏ ఒక్క విద్యార్థి కూడా ఇతర ప్రయివేటు పాఠశాలలకు వెళ్లకుండా గ్రామస్థులంతా కలిసి ఏకపక్ష నిర్ణయం తీసుకున్నారు. పాఠశాల ఎస్ఎంసీ ఛైర్మన్ ఎప్పటికప్పుడు పాఠశాల పర్యవేక్షణలో ఉంటారు. పాఠశాల అభివృద్ధి కోసం సర్పంచ్, ఉప సర్పంచ్, గ్రామాభివృద్ధి కమిటీ, స్థానిక సొసైటీ ఛైర్మన్, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, ఉప సర్పంచులు, గ్రామంలోని పలు కుల సంఘాల పెద్దలు ముందుకు వస్తుంటారని పాఠశాల ఛైర్మన్ పిప్పెర గణేష్, ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ తెలిపారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల పీఎంశ్రీ పథకానికి ఎంపికవడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పీఎంశ్రీ పథకం ఎంపికైన వేళా పాఠశాలకు కలిగే సదుపాయాలు డిజిటల్ గ్రంథాలయం, సోలార్ విద్యుత్, న్యూట్రిషన్ గార్డెన్, ఐసీటీ ల్యాబ్, శుద్ధిజలం, ప్లాస్టిక్ రహితంగా మార్చడం ఇలా పలు రకాల ప్రయోజనాలు కలగనున్నాయి.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని చేనేత కాలనీకి చెందిన ముఖేష్ ఇటీవల అనారోగ్యం వల్ల ఆసుపత్రిలో చికిత్స చేయించుకోగా ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి మంజూరు చేయించిన 60 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును కౌన్సిలర్, బార్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షురాలు ఖాందేశ్ సంగీత శనివారం అందజేశారు.

ఖానాపూర్ గ్రామంలో..

మండలంలోని ఖానాపూర్ గ్రామంలో అల్లం నవీన్‌కు రూ.20వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును శనివారం అందజేసినట్టు సర్పంచ్ సింగిరెడ్డి మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడుగు, బలహీన, పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తుందని, బాధిత కుటుంబ సభ్యులు తరపున నిండు మనసుతో ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సుధాచారి, బండి రవి, సుంకరి దాస్, సంతోష్ గ్రామ బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో 137వ మేడే పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆర్మూర్

అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మేడే 137వ పోస్టర్‌ను పట్టణంలోని మామిడిపల్లిలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి దాసు మాట్లాడుతూ.. 1886 మే 1న అమెరికాలోని చికాగో నగర కార్మికుల రక్తంతో కలిసి ఎగిరిన జెండానే ఎర్రజెండా అని ఆయన కొనియాడారు. చికాగో కార్మికుల త్యాగ ఫలితమే ఎనిమిది గంటల పని విధానం దేశవ్యాప్తంగా వచ్చిందని ఆయన తెలిపారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను తెచ్చి ఎనిమిది గంటల పని విధానాన్ని రద్దు చేయడానికి కుట్ర చేస్తుందని, కార్మిక హక్కులను కాల రాస్తుందని ఆయన అన్నారు. ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షులు సూర్య శివాజీ మాట్లాడుతూ.. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను హరిస్తూ శ్రమదోపిడీకి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వత్తాసు పలుకుతున్నాయని ఆయన అన్నారు. దేశీయ పరిశ్రమలను దెబ్బతీస్తూ ప్రభుత్వ బ్యాంకులను ప్రైవేటు వ్యక్తులకు అమ్మివేస్తూ కార్మికుల కొనుగోలు శక్తి నిర్వీర్యం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్‌డీ ఖాజా మొయినుద్దీన్ మాట్లాడుతూ.. మేడే అమరవీరుల స్ఫూర్తితో శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి కార్మిక రాజ్యస్థాపనకై ఉద్యమించాలని ఆయన కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా నాయకులు సుంకర శ్రీనివాస్, అల్తాఫ్, భానుచందర్, వెంకటాపూర్ గంగారం, గోపి, బీడిల మదర్, లతీఫ్ పాష తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని తప్పకుండా కొనుగోలు చేయాలి

- ఎడపల్లి మండల వ్యవసాయ శాఖ అధికారి సిద్ధిరామేశ్వరరావు



మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి

నవతెలంగాణ-ఎడపల్లి

ధాన్యాన్ని తప్పకుండా కొనుగోలు చేయాలని ఎడపల్లి మండల వ్యవసాయ శాఖ అధికారి సిద్ధిరామేశ్వరరావు అన్నారు. శనివారం ఉదయం రైతు వేదికలో డిప్యూటీ తహసీల్దార్ నారాయణ, సహకార సంఘాల అధ్యక్షులు కార్యదర్శులు, సొసైటీలు, ఐకేపీ సెంటర్ ఇన్చార్జిలకు, సొసైటీ సీఈఓలకు, కంప్యూటర్ ఆపరేటర్లకు వరి కొనుగోలుపై అవగాహన కల్పించారు.

ఆరోగ్యలక్ష్మీ, ఆరోగ్య మహిళ పథకాలు వినియోగించుకోవాలి

- తొర్తి సర్పంచ్ కుండ నవీన్

నవతెలంగాణ-ఏర్గట్ల

ఆరోగ్యలక్ష్మీ, ఆరోగ్య మహిళ పథకాలు వినియోగించుకోవాలని తొర్తి సర్పంచ్ కుండ నవీన్ తెలిపారు. మండలంలోని తొర్తిలో అంగన్వాడీ కేంద్రంలో వార్షికోత్సవ వేడుకలు నిర్వహించినట్టు అంగన్వాడీ టీచర్లు ప్రేమలత, లక్ష్మీ, శైలజ తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు చిరుధాన్యాలతో కూడిన వంటలను శనివారం వడ్డించారు. అనంతరం సర్పంచ్ కుండ నవీన్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరోగ్యలక్ష్మీ ఆరోగ్య మహిళా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ తాహెర్‌ఖాన్, వార్డు సభ్యులు, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విజయ్ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మోహన్‌రెడ్డి

నవతెలంగాణ-మాక్లూర్

ఆత్మహత్య చేసుకున్న విజయ్ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆలూర్ మండలంలోని కల్లెడ గ్రామంలో కాంగ్రెస్ మండలాధ్యక్షులు వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి డ్యాగ పోశెట్టిలతో కలిసి ఇటీవల ఆత్మహత్య చేసుకున్న విజయ్ కుటుంబాన్ని మానాల మోహన్‌రెడ్డి పరామర్శించి, బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ తరఫున పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మానాల మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. స్థానిక బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల ఒత్తిడితో అధికారులు చేసిన నిర్లక్ష్యానికి ప్రతిఫలమే విజయ్ ఆత్మహత్య అని, సామాన్య జీవితం గడుపుతున్న విజయ్ పాఠశాలకు ఛైర్మన్‌గా ఉండి పాఠశాల నిధులు దుర్వినియోగం కాకుండా మంచి నిర్మాణాలను చేపట్టాలని సదుద్దేశంతో స్కూల్ బిల్డింగ్స్, టాయిలెట్స్ నిర్మాణ పనులు చేపట్టాడని తెలిపారు. కానీ కల్లెడ బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అండదండలతో ఇంజనీర్ అధికారులపై ఒత్తిడి తెచ్చి విజయ్ చేసిన నిర్మాణాలకు తక్కువ మొత్తంలో రికార్డు చేసి చూపించడం ద్వారా విజయ్ పెట్టిన పెట్టుబడి తిరిగి రాక చేసిన బిల్లులు నెలల తరబడి ఆలస్యం కావడంతో విజయ్ ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. అంతేకాకుండా బాధితుని కుటుంబం పేదరికాన్ని అనుభవిస్తుందని, కనీసం ఉండడానికి కూడా ఇల్లు లేదని, ఇద్దరు పిల్లలు అనాథలయ్యారని, కావున వెంటనే ఆ కుటుంబానికి రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, విజయ్ భార్యకు అర్హతను బట్టి ఏదైనా ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, ఇంటి నిర్మాణం కొరకు స్థలం, డబ్బులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు వేణు రాజ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు ప్రవీణ్, మాజీ ఎంపీటీసీ రమేష్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు ప్రకాష్, ఎన్ఎస్‌యూఐ నాయ కులు అష్రఫ్, నర్సింగ్, మహేష్, కృష్ణ పాల్గొన్నారు.

మేయర్ జన్మదిన వేడుకలు

- శుభాకాంక్షలు తెలిపిన పలువురు



మేయర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న పలువురు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగర మేయర్ దండు నీతూకిరణ్ జన్మదినం సందర్భంగా రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్ బుస్స ఆంజనేయులు, కోశాధికారి కరిపే రవీందర్, కార్యవర్గ సభ్యులు మేయర్ దండు నీతూ కిరణ్ శేఖర్‌ను వారు శనివారం స్వగృహంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్ బుస్సా ఆంజనేయులు మాట్లాడుతూ.. నిజామాబాద్ ప్రజలకు ఎలాంటి అవసరాలు ఉన్న త్వరగా తీర్చేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా నిజామాబాద్ నగర మేయర్ దండు నీతూ కిరణ్ శేఖర్ మాట్లాడుతూ.. నిజామాబాద్ నగర ప్రజలకు ఎలాంటి సమస్య ఉన్న తెలిపితే తక్షణమే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ ఎండాకాలం నేపథ్యంలో రెడ్ క్రాస్‌లో రక్తం కొరత ఉన్నందున రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి తలసేమియా పేషెంట్లకు అందించాలని, ప్రజలను స్వచ్ఛంద సంస్థలను నిజామాబాద్ నగర మేయర్ కోరారు. కార్యక్రమంలో రామకృష్ణ, రెడ్‌క్రాస్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నిజాంబాద్ నగర మేయర్ జన్మదిన వేడుకలు

నగర మేయర్ దండు నీతూ కిరణ్ జన్మదినం సందర్భంగా నీలకంఠేశ్వరాలయం, గోల్ హనుమాన్ ఆలయాలలో ప్రత్యేక పూజలు చేశారు. మేయర్ క్యాంప్ కార్యాలయంలో మేయర్ దండు నీతూ కిరణ్ జన్మదినం సందర్భంగా మున్సిపల్ కమిషనర్ చిత్ర మిశ్రా, ఇంజనీరింగ్ సిబ్బంది, శానిటేషన్, ఇతర మున్సిపల్ అధికారులు, ఉద్యోగులు, కార్మికులు శుభాకాంక్షలు తెలిపారు. మేయర్ క్యాంప్ కార్యాలయంలో కార్పొరేటర్లు, నాయ కులు, కుల సంఘాల నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు. రేషన్ డీలర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేయించి, పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. 10,11 డివిజన్ల నాయకులు గోపాల్ ఆధ్వర్యంలో నాగారం 50క్వార్టర్ చౌరస్తాలో కాలనీ ప్రజలతో కలిసి కేక్ కట్ చేసి అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ దండు నీతూ కిరణ్ శేఖర్ మాట్లాడుతూ.. జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన నగర ఎమ్మెల్యే బిగాల గణేష్‌కు, మున్సిపల్ అధికారులు, ఇతర సిబ్బంది, కార్పొరేటర్లు, నాయకులకు, కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

బీజేపీ కో హటావో.. దేశ్‌కో బచావో..

- కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్



మాట్లాడుతున్న సుధాకర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

బీజేపీ కో హటావో.. దేశ్‌కో బచావో.. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ డిమాండ్ చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏప్రిల్ 14 నుంచి మే 15 వరకు రాష్ట్రవ్యాప్తంగా సీపీఐ ఆధ్వర్యంలో బీజేపీ హటావో దేశ్‌కో బచావో కార్యక్రమాన్ని పాదయాత్రల ద్వారా, జీపు యాత్ర ద్వారా ఇంటింటికి సీపీఐ కార్యక్రమం ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నామని దీనిలో భాగంగానే నిజామాబాద్‌లో మే ఒకటో తేదీన స్థానిక గాంధీగంజ్‌లో బహిరంగ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ బహిరంగ సభకు ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు కామ్రేడ్ పశ్య పద్మ, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ ఎమ్‌డీ యూసుఫ్ పాల్గొంటారని నిజామాబాద్ నగరంలోని ప్రజలు, కార్మికులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మే 1న నిజామాబాద్‌లో, 2న మోపాల్‌లో, 3న నందిపేట్‌లో, 4న బాల్కొండలో, 5న ఆర్మూర్లో, 6న బోధన్, కోటగిరిలో జీపుయాత్ర బహిరంగ సభలో, మండల కేంద్రాల్లో నిర్వహించనున్నట్టు తెలిపారు. సమావేశంలో జిల్లా నాయకులు వై.ఓమయ్య, కె.రాజన్న, బి.అనిల్, జి.రమేష్, సక్కి సురేష్ ప్రసాద్ పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

నవతెలంగాణ-కోటగిరి

కోటగిరి ఉమ్మడి మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో తడిసిన వరి ధాన్యం ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని కోటగిరి అంబేద్కర్ చౌరస్తాలో బీజేపీ మండల అధ్యక్షుడు గాండ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం రాస్తారోకో నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. సోంపూర్ టాకీ గ్రామాలలో సూర్యపువ్వు విత్తనాలు మొలకలు వచ్చాయని, కాంటాలు నిర్వహించకపోవడం వల్ల రైతులు నష్టం వాటిల్లిందని ఆర్భాటంగా కాంటాలు ప్రారంభించి వాటి నిర్వహణ వేగవంతం చేయకపోవడంతో రైతులు అకాల వర్షానికి నష్టపోయారని ప్రభుత్వం నష్టపోయిన రైతులను గుర్తించి వారికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

టీడబ్ల్యూజేఎఫ్ దీక్షకు మద్దతు తెలపాలి

నవతెలంగాణ-తాడ్వాయి

జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సాధన కోసం టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటి పిలుపు మేరకు వచ్చే నెల రెండవ తేదీన చేపట్టనున్న నిరాహారదీక్షకు మద్దతు తెలుపాలని జర్నలిస్టులు కోరారు. ఈ మేరకు బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గం ఇన్చార్జ్ కాటిపల్లి వెంకట్ రమణారెడ్డిని శనివారం కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయిస్తామని సీఎం కేసీఆర్ పలుమార్లు హామీ ఇచ్చి విస్మరించారని విమర్శించారు. ఆయనను కలిసిన వారిలో టీడబ్ల్యూ జెఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొక్కల వేణు, జిల్లా నాయకులు సాయిలు, మీడియా కోకన్వీనర్ బాలాజీ తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలో కలిగోట కల్పన కుటుంబానికి మంజూరైన రూ.60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును పార్టీ మండల అధ్యక్షులు బొల్లిపల్లి మహేందర్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే జాజాల సురేందర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో చెక్కు మంజూరు చేయించినట్టు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి అధ్యక్షులు ఎడ్ల నర్సింలు, పార్టీ నాయకులు అస మహేష్, అస రాజు, గణేష్ పంపిణీ చేశారు.



బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

బస్టాండ్‌లోకి రాని బస్సులు

- జాతీయ రహదారిపైనే పడిగాపులు
- ఎండ, వర్షంతో ప్రయాణీకుల పాట్లు
- అయినా పట్టని ఆర్టీసీ అధికారులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

కోట్లు వెచ్చించి నిర్మించిన జక్రాన్‌పల్లి బస్టాండ్ నిరుపయోగంగా మారింది. బస్సులు బస్టాండ్‌లోకి రాకపోవడంతో ప్రాయణ ప్రాంగణం కళ తప్పింది. జాతీయ రహదారి నుంచి బస్టాండ్‌లోకి బస్సులు రావాల్సి ఉన్నా.. ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యంతో హైవే నుంచే వెళ్లిపోతున్నాయి. దీంతో తప్పని పరిస్థితుల్లో బస్సుల కోసం ప్రయాణీకులు హైవే మీదనే ఎదురుచూడాల్సి వస్తుంది. ఎండ కొట్టినా, వర్షం పడినా బస్సుల కోసం పాట్లు పడుతూ నిలబడాల్సి వస్తుంది. ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే స్పందించి ఆర్టీసీ బస్సులు జక్రాన్‌పల్లి బస్టాండ్‌లోకి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.

జక్రాన్‌పల్లి మండల కేంద్రం నుంచి వేలాది మంది ప్రయాణీకులు అటు హైదరాబాద్‌కు ఇటు ఆర్మూర్ నుంచి ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. చుట్టు పక్కల గ్రామాల ప్రయాణీకులకు జక్రాన్‌పల్లి బస్టాండ్ కేంద్రంగా ఉంది. ఇక్కడి ప్రయాణీకుల సంఖ్య రీత్యా హైదరాబాద్ వెళ్లే ఆర్టీసీ బస్సులు తప్పనిసరిగా జక్రాన్‌పల్లి బస్టాండ్‌లోకి వెళ్లాల్సి ఉంది. జాతీయ రహదారి 44 దిగి సర్వీస్ రోడ్డు గుండా బస్టాండ్‌లోకి వెళ్లి రావాల్సి ఉన్నా.. అధికారుల నిర్లక్ష్యం.. సిబ్బంది తీరుతో బస్సులు హైవే మీదుగానే వెళ్తున్నాయి. కనీసం బస్టాండ్‌లోకి రాకపోయినా సర్వీస్ రోడ్డులో సైతం కనీస చిన్నపాటి బస్సు షెల్టర్ లేకపోవడం గమనార్హం. సర్వీస్ రోడ్డులో బస్ షెల్టర్ లేకపోవడం, బస్సులు బస్టాండ్‌లోకి రాకపోవడంతో ప్రయాణీకులు రోడ్డుపైనే బస్సుల కోసం ఎదురుచూడాల్సి వస్తుంది.





బస్సుల కోసం ఎండలో జాతీయ రహదారిపై ఎదరుచూస్తున్న మహిళలు, ప్రయాణికులు..

ఎండకొట్టినా, వర్షం కురిసినా జాతీయ రహదారిపైనే పడిగాపులు కాస్తున్నారు.

రాత్రి వేళల్లో ఇక్కట్లు

జక్రాన్‌పల్లి నుంచి హైదరాబాద్, ఆర్మూర్ నుంచి రాత్రి వేళల్లో వచ్చే ప్రయాణీకులకు మరింత ఇబ్బందులువుతున్నాయి. హైవే మీదనే బస్సులు నిలిపి అక్కడే దించేస్తుండటంతో రోడ్డు నుంచి గ్రామంలోకి వెళ్లేందుకు జంకుతున్నారు. కుక్కల బెడదతో పాటు దారిదోపిడీ దొంగలతో గ్రామస్తులు భయపడుతున్నారు. కుక్కలు రాత్రి వేళల్లో వెంటపడుతున్నాయని ముఖ్యంగా మహిళలు భయాందోళనకు గురవుతున్నారు. బస్సులు నేరుగా బస్టాండ్‌లోకి తీసుకెళ్తే ఈ ఇబ్బందులు తప్పే అవకాశం ఉంటది.



బస్సులు రాక బోసిపోతున్న బస్టాండ్

ఆర్టీసీ సంస్థ చైర్మన్‌గా ఉన్న రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ స్పందించి ఆర్టీసీ అధికారులకు, సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తే హైదరాబాద్‌కు వెళ్లే ఆర్మూర్ డిపో బస్సులు జక్రాన్‌పల్లి బస్టాండ్‌లోకి వెళ్లే అవకాశం ఉంది. ప్రస్తుతం నిజామాబాద్ ఒకటో, రెండో డిపో బస్సులు ఇందల్‌వాయి బస్టాండ్‌లోకి వెళ్తున్నట్టు ఆర్మూర్ డిపో బస్సులు జక్రాన్‌పల్లి బస్టాండ్‌లోకి వచ్చే విధంగా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

ఎండలోనే నిలబడుతున్నం

జైడి గంగారెడ్డి. జక్రాన్‌పల్లి



జక్రాన్‌పల్లి బస్టాండ్‌లోకి ఆర్మూర్ ఆర్టిసి డిపో ఎక్స్‌ప్రెస్ బస్సులు రాక ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జాతీయ రహదారి 44 పైనే బస్సులు ఆపుతుంటంతో వాటి కోసం ప్రయాణికులు, మహిళలు ఎండలో నిలబడి నానా అవస్థలు పడుతున్నారు. జాతీయ రహదారి పక్కన కనీసం బస్సు షెల్టర్ కూడా నిర్మించలేదు. ప్రజల కోసం పనిచేస్తున్న ప్రభుత్వం ప్రజల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారిపై అధికారులు చొరవ తీసుకొని చర్యలు తీసుకోవాలి. బస్టాండ్‌లోకి బస్సులు రప్పించాలి.

రాత్రి వేళ మరింత ఇబ్బందులు

వినోద్. జక్రాన్‌పల్లి



హైదరాబాద్ బస్సులు జక్రాన్‌పల్లిలోకి రావాలి. రాత్రివేళ విద్యార్థులకు మహిళలకు జాతీయ రహదారిపై నుంచి నడుచుకుంటి రావడం వల్ల కుక్కలు వెంబడబడుతున్నాయి. అదేవిధంగా దొంగతనం జరిగే అవకాశం ఉంది. బస్సులను జక్రాన్‌పల్లి బస్టాండ్‌లోనికి రప్పించే విధంగా ఏర్పాటు చేయాలి. హైదరాబాదుకు ప్రతిరోజు జక్రాన్‌పల్లి మండలం నుంచి వందలాది మంది వెళ్తూ ఉంటారు. కావున జక్రాన్‌పల్లి బస్టాండ్‌లో కంట్రోలర్‌ను నియమించి అన్ని సౌకర్యాలు కల్పిస్తూ బస్టాండ్లో అభివృద్ధిలోకి తేవాలని కోరారు.

బస్సులు వచ్చే విధంగా చూస్తాం

రచన. ఆర్మూర్ ఆర్టీసీ డిపో మేనేజర్

జక్రాన్‌పల్లి బస్టాండ్‌లోకి ఆర్మూర్ డిపో ఆర్టీసీ బస్సులు ఇంతవరకు రావడంలేదని మా దృష్టికి రాలేదు. ఆర్మూర్ బస్టాండ్‌లో, డిపోలోని నోటీస్ బోర్డులో బస్సులు జక్రాన్‌పల్లి బస్టాండ్‌లోకి వెళ్లాలని ఆదేశాలు జారీ చేస్తాం. ఇక నుంచి హైదరాబాద్ వెళ్లే ఆర్మూర్ డిపో బస్సులు బస్టాండ్‌లోకి వచ్చే విధంగా చూస్తాం. బస్టాండ్‌లోకి బస్సులు తీసుకెళ్లని డ్రైవర్, కండక్టర్‌లపై చర్యలు తీసుకుంటాం.

భారీ మెజార్టీతో గెలిచేలా కృషి చేస్తా

- కర్ణాటక ఎన్నికల పరిశీలకుడిగా నియమితులైన తోట లక్ష్మీకాంతారావు

నవతెలంగాణ-బిచ్కుంద



లక్ష్మీకాంతారావు

కర్ణాటక రాష్ట్రంలో మే 10వ తారీఖున అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఏఐసీసీ దళిత విభాగం జాతీయ అధ్యక్షులు రాజేష్ లిలోతీయ కర్ణాటక రాష్ట్రంలోని చించోలి నియోజకవర్గ పరిశీలికుడుగా తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కన్వీనర్, జుక్కల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు తోట లక్ష్మీ కాంతారావు ని నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా తోట లక్ష్మీకాంతరావు మాట్లాడుతూ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెడతానని, చించోలి నియోజక వర్గంలోని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అత్యధిక మెజారిటీతో విజయం సాధించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తనను నమ్మి ఈ బాధ్యతను అప్పజెప్పిన ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, కొప్పుల రాజు, ఏఐసీసీ దళిత విభాగం జాతీయ అధ్యక్షులు రాజేష్ లీలోతియ, తెలంగాణ కాంగ్రెస్ దళిత విభాగం చైర్మన్ నాగరగారి ప్రీతం లకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పజెప్పిన బాధ్యతను నిర్వర్తించేందుకు సత్వరమే కర్ణాటక రాష్ట్రంలోని చించోలీ నియోజకవర్గానికి బయలుదేరుతున్నట్లు తెలిపారు.

కారోబార్‌ల సమస్యలు పరిష్కరించాలి

- సమ్మె నోటీసు అందజేత



నోటీసులు అందజేస్తున్న కారోబార్‌లు

నవతెలంగాణ-గాంధారి

తమ సమస్యలు పరిష్కరించుకుంటే నిరవదిక సమ్మెలోకి వెళ్తామని పంచాయతీ కారోబార్‌లు స్పష్టంచేశారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో 51 ప్రకారం మల్టీపర్పస్ వర్కర్ నుంచి కారోబార్‌ను మినహాయించాలిన కోరారు. ప్రత్యేక స్టేటస్‌గా జీపీ కార్యదర్శికి అసిస్టెంట్‌గా నియమిస్తూ కనీస వేతనం అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. లేకుంటే వచ్చే నెల 5వ తేదీ నుంచి నిరవదిక సమ్మెలోకి వెళ్తామని మండల కారోబార్ సంఘం ప్రతినిధులు తెలిపారు.

విద్యుత్ తీగలతో అప్రమత్తంగా ఉండాలి

- జుక్కల్ ట్రాన్స్ కో ఏఈ నరేందర్

నవతెలంగాణ-జుక్కల్

విద్యుత్ తీగలతో అప్రమత్తంగా ఉండాలని జుక్కల్ మండల ట్రాన్స్ కో ఏఈ నరేందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండుమూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కురియగా, రానున్న రోజుల్లో మరిన్ని వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ అంచనా వేసినట్టు తెలిపారు. కావున ప్రజలు ఎట్టి పరిస్థితిలో విద్యుత్ స్తంబాలు, వైర్ల కింద నిలబడరాదని, తెగిపడిన విద్యుత్ వైర్లను తాకొద్దని సూచించారు. వైర్‌లు కిందపడి ఉన్నట్టు గమనిస్తే వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. ఇంటి ఆవరణలో దుస్తులు ఆరబెట్టుటకు విద్యుత్ స్తంబాలకు, స్టే వైర్లకు ఇనుప కమ్మిలతో కట్టొద్దని సూచించారు. ముఖ్యంగా రైతులు వ్యవసాయ పనుల నిమిత్తం బోర్ల వద్ద స్టార్టర్లను తడి చేతులతో తాకొద్దని, వైర్లు అతుకులు లేకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. పొలాల చుట్టు కంచెలు వేయొద్దని సూచించారు.

ముగిసిన సప్త.. అన్నదానం



సప్తలో పాల్గొన్న గ్రామస్తులు

నవతెలంగాణ-మద్నూర్

డోంగ్లి మండలంలోని మొగ గ్రామంలో వారం రోజులుగా కొనసాగిన శివనామ సప్త శనివారం ముగిసింది. సప్త ముగింపుతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఏడు రోజులపాటు ఆంజనేయస్వామి ఆలయంలో సప్తను పురస్కరించుకొని ప్రతిరోజు కీర్తనలు భజనలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముగింపు రోజు చిన్నారుల గీతం ఆహ్లాదపరిచింది. సప్త ముగింపు రోజు గ్రామంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు గ్రామ సర్పంచ్ సూర్యకాంత్ పటేల్, రాజు పటేల్, సుధాకర్ పటేల్, సూర్యకాంత్ పటేల్, సంతోష్ పటేల్, బసవంతరావు పటేల్, బసవరాజ్ పటేల్, ఉప సర్పంచ్ నాగేష్, ఆలయ పూజారి చందు మహారాజ్ మహిళలు పెద్ద సంఖ్యలు పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం

నవతెలంగాణ-మద్నూర్

మూడు రాష్ట్రాలకు పూర్తిగా సరిహద్దులో గల మద్నూర్ మండలంలోని సలాబత్పూర్ ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ పప్పు సెట్ జోహర్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకుముందు వివిద గ్రామాల నుంచి వచ్చిన సందర్శకులు ప్రత్యేక పూజలు చేశారు.

టీడీపీ హయాంలోనే అభివృద్ధికి బీజం

- నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయాలి
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్

నవతెలంగాణ-వర్ని



మాట్లాడుతున్న కాసాని జ్ఞానేశ్వర్

దేశం గర్వించేలా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసింది తెలుగుదేశం పార్టీ ఉభయ రాష్ట్రాల మాజీ ముఖ్యమంత్రి టిడిపి పార్టీ వ్యవస్థాపకులు చంద్రబాబు నాయుడు అని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ అన్నారు. శనివారం వర్ని మండల కేంద్రంలోని వి.ఎం.ఆర్ గార్డెన్లో మాజీ ముఖ్య మంత్రి తారక రామారావు 100 శత వారికోత్సవ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ ఇతర జిల్లాలు అభివృద్ధి చెందినా అంటే అది తెలుగుదేశం పార్టీ పాలనలోనే అని అన్నారు. నేటి పాలన సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుందని చివరకు పరీక్ష పేపర్లు లీకేజ్ చేసి విద్యార్థులు పరీక్షలు రాయలేని పరిస్థితిలో పాలన కొనసాగించడం సరికాదన్నారు. నిరుద్యోగ సమస్య తెలంగాణలో మరింత పెరిగిపోతుందని, మహిళలపై అగైత్యాలు జరుగుతున్నాయని ఇవన్నీ చూస్తూ కూడా పాలకులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా వాస్తవాలను వెలికి తీసి నిజం నిర్భయంగా రాయాలని కోరినారు. తెలుగుదేశం పార్టీ హాయంలో చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత పార్టీ కార్యకర్తల భుజాలపైన ఉందని అన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో రాబోయే ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేసినారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పుట్టిన ఆడబిడ్డలకు ఐదువేల రూపాయలు చదువుకోడానికి వెళ్లడానికి సైకిళ్ళు మహిళా సంఘాలకు పావుల వడ్డీ ఇచ్చి మహిళలకు వారి కాళ్ళ పైన నిలబడేలా మహిళా సంఘాలను ఏర్పాటు చేసింది తెలుగుదేశం పార్టీని పేర్కొన్నారు.

హైదరాబాదులో హైటెక్ సిటీ తో పాటు ఐటీ రంగాన్ని అభివృద్ధి పరిచి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు పొందేలా చేసిన ప్రభుత్వం తెలుగుదేశం పార్టీ అని తెలిపారు. తెలుగుదేశం పార్టీ చేసిన అభివృద్ధి నేడు తెలంగాణ లో కనబడుతుందని అన్నారు. కుటుంబ పాలనలో అనేక దోపిడీలు జరుగుతున్నాయని సామాన్య ప్రజలకు న్యాయం జరగటం లేదని అందుకు రాబోయే దినాల్లో ప్రజలు తగిన శాస్తి చెప్తారని అన్నారు. తెలుగుదేశం పార్టీని కార్యక్రమాలను గడపగడపకు తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో అన్ని నియోజకవర్గాలలో టిడిపి పార్టీ నుంచి పోటీ చేస్తామని తెలిపినారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కరాటే రమేష్, రాష్ట్ర కార్యదర్శి శ్రీనగర్ విట్టల్, మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు షకీలా, పార్టీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

నవతెలంగాణ-గాంధారి



డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్

మద్యం సేవించి వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని, కావున వాహనదారులు నిబంధనలు అతిక్రమించొద్దని గాంధారి ఎస్ఐ డి.సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఈ నెలలో ఇప్పటి వరకు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన 20 మందిపై కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన 277 మందిపై కేసులు నమోదుచేసి 81,200/- రూపాయల జరిమానా విధించినట్టు తెలిపారు.

సంతాన సాఫల్యత శిబిరం



శిబిరానికి హాజరైన పలువురు

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట మండల కేంద్రంలోని అజయ్ హాస్పిటల్‌లో శనివారం హవీరా ఫెర్టిలిటీ ఆస్పత్రి సౌజన్యంతో డాక్టర్ అజయ్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సంతాన సాఫల్యత శిబిరం నిర్వహించారు. సుమారు 100 దంపతులకు కౌన్సెలింగ్ నిర్వహించినట్టు తెలిపారు. హైదరాబాదులోని హైటెక్ సిటీలో గల అవిరా ఫెర్టిలిటీ డాక్టర్ హరిత పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో ఆనంద్ భాను, ల్యాబ్ టెక్నీషియన్ రమేష్, శివకుమార్, రామకృష్ణ, అజయ్, శోభన్, ప్రభాకర్ మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

రెగ్యులర్ చేసే వరకూ సమ్మె

- రెండో రోజుకు జూనియర్ పంచాయతీ కార్యదర్శుల రిలే దీక్షలు
- మద్దతు తెలిపిన పలువురు అధికారులు

నవతెలంగాణ-విలేకరులబృందం

తమకు ఇచ్చిన హామీ మేరకు తమను రెగ్యులర్ చేయాలని, అప్పటి వరకు సమ్మె కొనసాగిస్తామని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు స్పష్టంచేశారు. ఈ మేరకు వారు చేపట్టిన రిలే దీక్షలు శనివారంతో రెండో రోజుకు చేరుకున్నాయి. మండల కేంద్రాల్లోని ఎంపీడీవో కార్యాలయాల ఎదుట నినాదాలు చేపడుతూ నిరసన వ్యక్తం చేశారు.

పెద్దకొడప్‌గల్ : జూనియర్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యులర్ చేస్తూ జీవోను విడుదల చేయాలని, గడిచిన నాలుగు సంవత్సరాలు ప్రొబేషన్ కాలాన్ని సర్వీస్ కాలంగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ జేపీఎస్‌లు చేపట్టిన సమ్మె రెండో రోజుకు చేరుకుంది.

జేపీఎస్‌లకు సంఘీభావం తెలిపిన ఎంపీడీవో

పిట్లం : మండల కేంద్రంలో జేపీఎస్‌ల సమ్మెకు ఎంపీడీవో వెంకటేశ్వర్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడేండ్ల ప్రొబేసనరీతో డైరెక్ట్ రిక్రూట్మెంట్ అయినప్పటికీ ప్రభుత్వం మరో ఏడాది ప్రొబేసనరీ కాలం పెంచినా సమర్థవంతంగా నాలుగేళ్ల పాటు విధులు నిర్వర్తించి పంచాయతీల అభివృద్ధికి సహకరించిన జూనియర్ పంచాయతీ సెక్రెటరీలను పర్మనెంట్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి బ్రమ్మం , ఏపీవో శివ , సిబ్బంది పాల్గొన్నారు.





పిట్లంలో సంఘీభావం ప్రకటించిన ఎంపీడీవో, ఎంపీవో.. జుక్కల్‌లో నినాదాలు చేస్తున్న జేపీఎస్‌లు

జక్రాన్‌పల్లి : నాలుగేండ్ల సంవత్సరాల ప్రొబేషన్ కాలం పూర్తయిన తమను రెగ్యులర్ చేయాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు చేపట్టిన సమ్మె శనివారంతో రెండో రోజుకు చేరుకుంది. జక్రాన్‌పల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట రిలే దీక్ష కొనసాగింది.

వంటావార్పుతో నిరసన

జుక్కల్ : మండల కేంద్రంలో జేపీఎస్‌లు సమ్మెలో భాగంగా రెండో రోజు శనివారం వంటావార్పుతో నిరసన కొనసాగించారు. తమను రెగ్యులర్ చేసి న్యాయమైన డిమాండ్‌లు పరిష్కరించే వరకూ సమ్మె కొనసాగిస్తామని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో జేపిఎస్‌లు విజయ్ షిండే, సునిత, అనురాధా, శ్రీనివాస్, వికాస్ రెడ్డి, సతీష్, ఆశోక్, జాదవ్ మనోహర్ పాల్గొన్నారు.

మా నాన్నను రెగ్యులర్ చేయండి

నాన్నకు తోడుగా చిన్నారి



మద్నూర్ : మద్నూర్ మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులు సమ్మెలో భాగంగా రిలే దీక్ష చేపట్టగా.. ఓ చిన్నారి తన తండ్రికి తోడుగా రిలే దీక్షలో కూర్చున్నాడు. పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యులర్ చేయండి అంటూ ప్లకార్డు ప్రదర్శించాడు. జేపీఎస్ కార్యదర్శులు ఎంపీడీవో కార్యాలయం ఎదుట సమ్మెలో భాగంగా దీక్షలు కొనసాగుతున్నాయి.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

నవతెలంగాణ-పిట్లం

సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై విజయ్ కొండ అన్నారు. శనివారం మండల పోలీస్ స్టేషన్ ముందు ప్రజలకు సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరగాళ్లు బ్యాంక్ నుండి మాట్లాడుతున్నాం పిన్ నెంబర్ , ఓటిపి చెప్పండి అనగానే స్పందించి పిన్ , ఓటిపి నెంబర్లను చెప్పకూడదని సూచించారు. ప్రయాణ సమయంలో ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. బైక్, ఫోర్ వీలర్ వాహనాలను అతివేగంగా , అజాగ్రత్తగా నడపొద్దని చెప్పారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ సాయగౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

తుదిదశకు చేరుకున్న కురుమ సంఘం పనులు

నవతెలంగాణ-నందిపేట్

మండల కేంద్రంలో కురుమ సంఘం పనులు తుదిదశకు చేరుకున్నాయి. కళ్యాణ మండపం నిర్మాణం కొరకు స్థానిక ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి రూ.కోటి నిధులు మంజూరు చేశారు. ఆర్మూర్ నియోజకవర్గ కురుమ సంఘం నాయకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే జీవన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో కురుమ ప్రజలంతా అండగా ఉంటామని రాబోయే ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించి మంత్రిగా చూడాలన్నదే తమ కోరికని పేర్కొన్నారు. కార్యక్రమంలో కురుమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తొండకూర్ దేవన్న, ఆర్మూర్ నియోజకవర్గ కురుమ సంఘం అధ్యక్షులు కె.జి.సురేష్, నందిపేట్ ఉపాధ్యక్షులు బోగన్న, నాయకులు కురుమ గంగాధర్, యూత్ అధ్యక్షులు రాజశేఖర్, యువ నాయకులు దత్తాపూర్ సతీష్, సిరిపూర్ భోజన్న, శ్రీను, గుండంపల్లి శ్రీనివాస్, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

ఆలూర్‌లో కాంప్లెక్స్ నిర్మాణానికి నిధులు మంజూరు

నవతెలంగాణ-ఆర్మూర్



ఆలూర్ మండలంలోని కొత్తగా నిర్మించిన కాంప్లెక్స్ కొరకు ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి మంజూరు చేసిన రూ.15లక్షల ప్రొసీడింగ్ కాపీని నియోజవర్గ ఇన్చార్జి రాజేశ్వర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రొసీడింగ్ కాపీని శనివారం గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులకు అందజేశారు. గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. తమకు 15 లక్షలు కాంప్లెక్స్ కొరకు మంజూరు చేసిన ఎమ్మెల్యే జీవన్‌రెడ్డికి, రాజేశ్వర్‌రెడ్డికి సీఎం కేసీఆర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అభివృద్ధి కమిటీ అధ్యక్షులు బార్ల గణపతి, జడ్పీటీసీ మెట్టు సంతోష్, ఎంపీపీ పస్కా నరసయ్య, సర్పంచ్ కళ్లెం మోహన్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ కళ్లెం బోజారెడ్డి, ఎంపీటీసీ లక్ష్మీమల్లేష్, ఉప సర్పంచ్ దుమ్మాజి శ్రీనివాస్ గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు సాయిరెడ్డి, సంజీవ్, ఎడ్ల నడపన్న కొండయ్య, గంగారెడ్డి, శ్రీకాంత్, రాజు, సురేష్, నవీన్ పాల్గొన్నారు.

రెగ్యూలర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలి

- రెండో రోజుకు జేజీఎస్‌ల సమ్మె

నవతెలంగాణ-విలేకరుల బృందం

జూనియర్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించాలని రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా పలు మండల కేంద్రాల్లో పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మె శనివారం రెండో రోజు కొనసాగింది.

మాక్లూర్ : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ముందు జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమ్మె మా హక్కు అని చేయడం లేదని సమ్మె ద్వారా ఆవేదన మాత్రమేనని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా కమిటీ అడ్వైజర్ మోహన్, నాగేంద్ర, ఈసీ మెంబర్ రాజేష్, మండల అధ్యక్షులు మహేష్, కార్యదర్శులు పాల్గొన్నారు.

సిరికొండ : స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ముందర పంచాయతీ కార్యదర్శులు సమ్మె చేశారు. ఓపీఎస్‌లను జేపీఎస్‌లుగా వెంటనే మార్చాలని, జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ప్రొబిషనరీ కాలాన్ని సర్వీస్ కాలంగా పరిగణించాలని, మరణించిన జూనియర్ పంచాయతీ కార్యదర్శుల కుటుంబాలను ఆదుకుని వెంటనే కారుణ్య నియామకాలను చేపట్టాలని జూనియర్ కార్యదర్శుల కమిటీ మండలాధ్యక్షులు శ్రీకాంత్, ఉపాధ్యక్షులు మహేష్, ప్రధాన కార్యదర్శి సుమన్, కోశాధికారి ప్రశాంత్ పాల్గొన్నారు.

కోటగిరి :మండలంలోని పంచాయతీ కార్యదర్శులు ఉద్యోగ భద్రత కల్పించాలని నాలుగు సంవత్సరాల ప్రొబేషనరీ పిరియడ్ పూర్తయినప్పటికీ ప్రభుత్వం రెగ్యులర్ చేయకుండా కాలయాపన చేస్తుందని నిరసన వ్యక్తం చేస్తూ సమ్మెలో పాల్గొన్నారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ప్రతాప్ కార్యదర్శులు శ్రావణ్, చంద్రకాంత్, రాజు, స్వప్న, నిర్మల, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

భీంగల్ : రాష్ట్ర ప్రభుత్వం క్రమబద్ధీకరణ జీవోను జారీ చేసి దాని ప్రకారం వేతనాలు అందించాలని జూనియర్ పంచాయతీ కార్మికులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా మూడు సంవత్సరాల తర్వాత రెగ్యులర్ చేస్తామని చెప్పి ఇప్పటికి అప్రెంటిస్ కాలం పూర్తవుతున్న రెగ్యులర్ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనుక ప్రభుత్వం ఇప్పటికైనా తమ పనులను గుర్తించి క్రమబద్ధీకరణ జీవోను అమలు, వాటి ఆధారంగా వేతనాలను అందించాలని కోరారు. ఈ ధర్నాలో అన్ని గ్రామల పంచాయతీ కార్యదర్శులు శేఖర్, అభిజిందర్, మాలవత్ రాజు, గణేష్, కిషన్, జితెందర్, హేమలత, అనూష తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణ జీవో జారీ చేయాలనే ప్రధాన డిమాండ్‌తో పట్టణ ఎంపీడీవో కార్యాలయం ముందు శాంతియుతంగా సమ్మె చేపట్టారు. కార్యక్రమంలో మండలంలోని అంకాపూర్, గోవింద్‌పేట్, ఖానాపూర్, మగ్గిడి, ఫతేపూర్, దేగాం, గగ్గపల్లి, కోమన్‌పల్లి, మచ్చర్ల, మిర్దాపల్లి, రాంపూర్ గ్రామాల జూనియర్ పంచాయతీ కార్యదర్శులు హారిక, సుకన్య, సౌందర్య, శ్వేత, రమ, దేవేందర్, ప్రసాద్, సురేష్, ఎస్.కె.నాసిర్, రాజ్‌కుమార్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కమ్మర్‌పల్లి : సమ్మెలో పాల్గొన్న పంచాయతీ కార్యదర్శులు..



ఆర్మూర్‌లో..

కమ్మర్‌పల్లి : జూనియర్ పంచాయతీ, అవుట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను తక్షణమే రెగ్యులర్ చేయాలని పంచాయతీ కార్యదర్శులు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన జూనియర్ పంచాయతీ అవుట్ సోర్సింగ్ పంచాయతీ కార్మికులు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శిబిరం ఏర్పాటు చేసుకుని సమ్మె ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019 ఏప్రిల్ 11న ప్రభుత్వం చే మూడు సంవత్సరాల ప్రొబిషన్ కాలపరిమితితో ఉద్యోగాలలో చేరడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ అసెంబ్లీ సాక్షిగా మరొక సంవత్సరం ఈ ప్రొహిబిషన్ కాల పరిమితిని పెంచడం జరిగిందని, అయినప్పటికీ మారు మాట్లాడకుండా విధులు నిర్వర్తించామన్నారు. ముఖ్యమంత్రి విధించిన నాలుగు సంవత్సరాల కాల పరిమితి ఈ ఏప్రిల్ 11వ తేదీతో పూర్తయిందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్యక్రమాలను, కరోనా సమయంలో ఇంటింటి సర్వే, పల్లె ప్రగతి, పోడు భూములు, కంటి వెలుగు వంటి కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం, ముఖ్యమంత్రి కేసీఆర్ మాపై దయతలచి నాలుగు సంవత్సరాల ప్రొబిషన్ కాల పరిమితిని సర్వీస్ గా పరిగణించి రెగ్యులరైజ్ చేసి 9వేల కుటుంబాలను ఆదుకోవాలని వేడుకున్నారు. విధి నిర్వహణలో మరణించిన జూనియర్ పంచాయతీ కార్యదర్శుల కుటుంబాలను ఆదుకోవాలని, రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ కార్యదర్శుల క్యాడర్ స్ట్రెంత్ నిర్ధారించి ప్రకటించాలని డిమాండ్ చేశారు. శిబిరంలో డిమాండ్లతో కూడిన ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు రజిత, జులేఖ, శ్రీలత, సంధ్య, ఎస్. నవీన్, శ్రీకాంత్, విజయ్, ఏ.నవీన్, తదితరులు పాల్గొన్నారు.

జేపీఎస్‌ల సమ్మెకు ఎంపీడీవో, ఎంపీఓల మద్దతు..

నవీపేట్ : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా జూనియర్ పంచాయతీ కార్మికుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రారంభించిన సమ్మెకు ఎంపీడీవో సాజిద్ అలీ, ఎంపీఓ రామకృష్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత నాలుగు సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేసే జూనియర్ కార్యదర్శుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పరిష్కరించాలని కోరారు. జూనియర్ పంచాయతీ కార్యద ర్శులను క్రమబద్ధీకరించాలని, ఓపీఎస్‌లను జీపీఎస్‌లుగా ప్రమోషన్ కల్పించాలని, చనిపోయిన జూనియర్ కార్యదర్శుల కుటుంబంలోని వ్యక్తికి కారుణ్య నియామకం ద్వారా నియమకాలు చేపట్టాలని కోరారు. శాంతియుతంగా నిర్వహిస్తున్న సమ్మెకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జూనియర్ కార్యదర్శులు రామాగౌడ్, నాగరాజు, అర్చన, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.



ముప్కాల్‌లో..

బోధన్ : ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పనిచేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం తక్షణమే పర్మినెంట్ చేయాలని పంచాయతీ కార్యదర్శులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం బోధన్ ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో నిరవధిక సమ్మె చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ.. జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు మూడు సంవత్సరాల తర్వాత ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కానీ ప్రభుత్వం ఇప్పటివరకు తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించలేదని అన్నారు. అసెంబ్లీ సాక్షిగా జీఓ నెం.26 ప్రకారం 2021లో విడుదల చేసిన దాని ప్రకారం ప్రొబేషనరీ కాలాన్ని ఒక సంవత్సర కాలం పెంచారని, అది కూడా 2023 ఏప్రిల్‌తో ముగిసిందని ప్రభుత్వం ఉద్యోగాలను పర్మినెంట్ చేయలేదన్నారు. నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచి నేటి వరకు సుమారు 40 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, ఓపీఎస్ ఉద్యోగులు మృతి చెందారని వాపోయారు. అందరూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేస్తూ ఈ నాలుగు సంవత్సరముల ప్రొబేషనరీ కాలాన్ని సర్వీస్ కాలముగా పరిగణనలోకి తీసుకోవాలని, ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా ప్రమోట్ చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ కార్యదర్శులు క్యాడర్ స్ట్రెంత్ నిర్ధారించి ప్రకటించాలని, ఇప్పటివరకు విధి నిర్వహణలో మరణించిన జేపీఎస్/ఓపీఎస్ కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమ్మెలో జిల్లా జూనియర్ పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ గౌరవాధ్యక్షులు బాలకృష్ణ, మండల అధ్యక్షులు మహేందర్, సుధాకర్, రాజీవ్‌గాంధీ, శ్రీనివాస్, శైలజ, హరిత, గంగామణి తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్ : నాలుగు సంవత్సరాల ప్రొబేషన్ పీరియడ్ పూర్తి చేసుకున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు తమను రెగ్యులర్ చేయాలని కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్యదర్శులు శనివారం సమ్మెకు దిగారు. తమ సమ్మె ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని, కేవలం సమ్మె ద్వారా తమ ఆవేదనని రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేస్తున్నామని ఈ సందర్భంగా వారు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు భరత్ స్వరూప్, శంకర్, వనజ, గౌతమి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో వార్షికోత్సవ వేడుకలు



కమ్మర్‌పల్లిలో..

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి/సిరికొండ

మండలంలోని ఉప్లూర్ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అన్యువల్ డే (వార్షికోత్సవ) వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను సర్పంచ్ బద్దం పద్మ చిన్నారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ మండల పర్యవేక్షకురాలు సరస్వతి మాట్లాడుతూ.. ఈ వేడుకల్లో భాగంగా కార్యక్రమానికి హాజరైన చిన్నారుల తల్లిదండ్రులు, లబ్ధిదారులకు, గర్భిణులు, బాలింతలకు పూర్వ ప్రాథమిక విద్య ప్రాముఖ్యత, అంగన్వాడీ కేంద్రం ప్రాముఖ్యత వివరించారు. చిన్నారుల జీవితంలో మొదటి ఆరు సంవత్సరాలు చాలా కీలకమైనవి అన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో శారీరక అభివృద్ధి, సామాజిక వ్యక్తిగత అభివృద్ధి, భాషాభివృద్ధి, మేధోవికాసం, బడికి సంసిద్ధత, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం కార్యక్రమంలో అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లల ద్వారా మంచి అలవాట్లు, సంభాషణ, కథ, పాట, ఆటలు, అంకెల పరిచయం, అక్షర పరిచయం పిల్లలతో చేయించి తల్లిదండ్రులకు ప్రత్యక్షంగా చూపించారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులకు అన్నప్రాసన, జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పిప్పెర అనిల్, ఉప సర్పంచ్ నందగిరి రేఖ శ్రీధర్, అంగన్వాడీ టీచర్లు అంజలి దేవి, పద్మ, శోభ, సరిత, అంగన్వాడీ ఆయాలు, ఆశాకార్యకర్తలు, చిన్నారుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ : మండలంలోని కొండాపూర్, హుస్సేన్‌నగర్ గ్రామాలలో అంగన్వాడీ కేంద్రాలలో అన్యువల్ వార్షికోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. కొండాపూర్ సర్పంచ్ పొడేండ్ల రమేష్, హుస్సేన్‌నగర్ సర్పంచ్ దానేమ్ లక్ష్మీతిరుపతి ఆధ్వర్యంలో అంగన్వాడీ సూపర్‌వైజర్ ప్రియదర్శిని, అంగన్వాడీ కార్యకర్తలు, విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ చేయించారు. వేసవికాలంలో పిల్లలను బయట తిరగనీయవద్దని, సామాజికంగా, వ్యక్తిగతంగా పిల్లల మేధో వికాసం, భాషాభివృద్ధి, బడికి సంసిద్ధత తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



సిరికొండలో..

మేడే వారోత్సవాలను జయప్రదం చేయండి

నవతెలంగాణ-వర్ని/కంఠేశ్వర్



వర్ని : మాట్లాడుతున్న రమేష్‌బాబు

అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని వారం రోజులపాటు కార్మికులు, కర్షకులు, కష్టజీవులు మేడే వారోత్సవాలు ఘనంగా నిర్వహించి, కష్టజీవుల ఐక్యతను మేడే స్ఫూర్తిని ప్రపంచానికి చాటి చెప్పాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రమేష్ బాబు పిలుపునిచ్చారు. శనివారం వర్ని మండల కేంద్రంలో సీఐటీయూ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడాతూ.. పని గంటలు తగ్గించాలని, కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ 1886లో అమెరికాలోని చికాగో నగరంలో కష్టజీవులు చేసిన మహోత్తరమైన పోరాట ఫలితంగా ఎర్రబావుట విజయం సాధించిందన్నారు. మే డే కష్టజీవుల పండగ అని ప్రతి గ్రామంలో ఎర్రజెండాలు ఎగురవేసి మే డే పోరాట స్ఫూర్తిని చాటాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నన్నేసాబ్, జిల్లా నాయకులు కొండ గంగాధర్, సీఐటీయూ నాయకులు రాజు, వెంకటరమణమ్మ, సత్యవ్వ, వరలక్ష్మి, మేఘన తదితరులు పాల్గొన్నారు.

కంఠేశ్వర్ : మేడే వారోత్సవాలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు మల్యాల గోవర్ధన్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలో మే 1 నుంచి 7వ తేదీ వరకు జరిగే మేడే వారోత్సవాలను జయప్రదం చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ సర్కిల్ 2, సర్కిల్ 3లలో ఉదయం ఐదు గంటలకు హాజరుపై వెళ్లి మున్సిపల్ కార్మికుల వద్ద ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మల్యాల గోవర్ధన్ మాట్లాడుతూ.. మనుషులను విడగొడుతూ మతాల ప్రాతిపదికన పండగలు జరుపుకుంటుంటే మతాలకు అతీతంగా మనుషులందరూ శ్రమజీవులు కలిసి జరుపుకునే పండగ మే డే అని అన్నారు. అమరవీరుల త్యాగ చరిత్రతో, రక్తార్పనంతో నిండిన కార్మికుల దినోత్సవాన్ని మే 1 నుంచి 7వ తేదీ వరకు వారోత్సవాలను ఘనంగా కార్మిక వర్గం నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ కార్మికుల స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మేడే స్ఫూర్తితో సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్షులు చంద్రసింహ, కార్యదర్శి భూపతి, ఉపాధ్యక్షులు సుర రవి, మోహన్, కిషన్, సదానంద్, తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం.. ఆందోళనలో రైతులు

- తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన అధికారులు, ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-విలేకరుల బృందం

జిల్లా వ్యాప్తంగా గత వారం రోజులుగా సాయంత్రం వేళల్లో ఉరుములు మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో పలుచోట్ల పంట నష్టం వాటిల్లింది. ప్రధానంగా చేతికొచ్చిన పంటను కోతకోసి పోసిన ధాన్యం రాసులు అక్కడక్కడ తడిసి ముద్దయ్యాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇక తడిసిన ధాన్యాన్ని, నష్టపోయిన పంటను అధికారులు, ప్రజాప్రతినిధులు శనివారం పరిశీలించారు.

ఎడపల్లి : ఎడపల్లి మండలం సుమారుగా 400 మంది రైతుల వరి ధాన్యం రోడ్లపైన ఇరు పక్కల ఉన్నాయి. ఎంపీపీ కే శ్రీనివాస్‌తో పాటు డిప్యూటీ తహసీల్దార్, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి మంగల్‌పాడు గ్రామ శివారులోని ధాన్యాన్ని పరిశీలించారు.



బోధన్ : పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

బోధన్ : గత రెండు రోజులుగా కురిసిన అకాల వర్షానికి నేలరాలిన వరి పంటను సాలూర క్లస్టర్ ఏఈఓ అపర్ణ పరిశీలించారు. సాలూరాకు చెందిన రైతు దత్త్రాత్రి పొలంలో అకాల వర్షం ధాటికి చేతికి వచ్చిన వరి పంట పూర్తిగా నేలరాలింది. వేల రూపాయల పెట్టుబడి పెట్టి పంట వేస్తే అకాల వర్షానికి పూర్తిగా నేలిమట్టమైందని రైతు దత్తాత్రి వాపోయారు. పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం సహాయం చేసి ఆదుకోవాలని ఆయన కోరారు. సాలురా క్లస్టర్ పరిధిలో రైతులకు సంబంధించిన వరి పంటలు కొంత మేరకు అకాల వర్షానికి నష్టమయ్యాయని, నష్టపోయిన పంట వివరాలను సర్వే చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తానని ఏఈఓ అపర్ణ తెలిపారు.

కమ్మర్‌పల్లి : మండలంలోని బషీరాబాద్ గ్రామంలో ఈదురు గాలులతో కూడిన అకాల వర్షాలకు నేలకొరిగిన వరి పొలలను తహసీల్దార్ సురేష్, మండల వ్యవసాయ అధికారి బద్దం లావణ్యతో కలిసి పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంట నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులు ఆధైర్యపడవద్దని, ప్రభుత్వం తప్పకుండా ఆదుకుంటుందన్నారు. వ్యవసాయ శాఖ సిబ్బంది పంట నష్టం వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలిపారు. పంట నష్టపోయిన రైతులు వారి పట్టా పాసుబుక్, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్, ఫోన్ నెంబర్ వివరాలు అన్ని వ్యవసాయ విస్తీర్ణ అధికారి పద్మకు ఇవ్వాలని మండల వ్యవసాయ అధికారి లావణ్య రైతులకు సూచించారు. సర్పంచ్ సక్కారం అశోక్, ఏఈఓ పద్మ సక్కారం నారాయణ, తోట అప్పయ్య, నెల్ల రమేష్ ఉన్నారు.

పంట నష్టపరిహారం వెంటనే ఇవ్వాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

అకాల వర్షాలకు దెబ్బతిన్న పంట నష్టపరిహారం వెంటనే ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ అన్నారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. అనంతరం మూడ్ శోభన్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అకాల వర్షాల వలన పంటలు దెబ్బతిన్నా ప్రభుత్వం ఇప్పటికి నష్ట పరిహారం ఇవ్వలేదని అన్నారు. ఇటీవల తెలంగాణ రైతు సంఘం బృందం పర్యటించిన రైతాంగాన్ని కలిసిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు యం గంగాధరప్ప, పల్లపు వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షులు దేవేందర్ సింగ్, భూమన్న, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో వినతి..

అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ప్రభుత్వమే ఇవ్వాలని అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వేల్పూర్ భూమయ్య మాట్లాడుతూ ఇటీవల జిల్లాలో కురిసిన అకాల వర్షానికి వడగళ్ల వానకు రైతులు పంటలను అధికంగా నష్టపోయారని, సుమారు జిల్లాలో 15,800 ఎకరాలు వరి, మొక్కజొన్న, పసుపు, మామిడి, సజ్జ తదితర పంటలు వర్షానికి తడిసి ముద్దయ్యాయని తెలిపారు. ఆరబోసిన ధాన్యంలో నీరు చేరి మొలకలు వస్తున్నాయని, రంగు మారుతుందన్నారు. ఇప్పటికి 50శాతం కోతలు పూర్తయి 15 రోజులుగా కల్లాల వద్దనే రైతులు పడిగాపులు కాస్తున్నా తూకం వేయలేని దుస్థితి ఎదురైందని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేశెట్టి సాయిరెడ్డి, ఉపాధ్యక్షులు హగ్గ ఎర్రన్న, టి.కృష్ణగౌడ్, సహాయ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీయూ అవకతవకలపై సీబీఐతో దర్యాప్తు జరపాలి

- పీడీఎస్‌యూ డివిజన్ అధ్యక్షులు ప్రిన్స్

నవతెలంగాణ-ఆర్మూర్

తెలంగాణ యూనివర్సిటీలో గత కొన్ని నెలలుగా అక్రమ నియామకాలు చేస్తూ, కోట్లాది రూపాయలు దండుకున్న యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ రవీందర్ గుప్తాపై సమగ్ర విచారణ జరిపి, అతన్ని విధుల నుంచి బర్తరఫ్ చేయాలని పీడీఎస్‌యూ డివిజన్ అధ్యక్షులు ప్రిన్స్ డిమాండ్ చేశారు. దీనిపై ఆందోళన చేస్తున్న పీడీఎస్‌యూ నేతలను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. అడ్డదారిలో అక్రమంగా బోధన, బోధనేతర ఉద్యోగ నియామకాలు చేపడుతూ, తెలంగాణ యూనివర్సిటీ నిధులను ఇష్టం వచ్చినట్టుగా దుర్వినియోగం చేస్తున్న వైస్ ఛాన్సలర్ రవీందర్ గుప్తా, రిజిస్ట్రార్ విద్యవర్ధినిపై విచారణ జరిపించి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్‌ను తక్షణమే ప్రక్షాళన చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న అన్ని రకాల పోస్టులను భర్తీ చేసి, యూనివర్సిటీని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికి సీపీఐ

నవతెలంగాణ-కోటగిరి

మండలంలోని సుద్దులం గ్రామంలో సీపీఐ జాతీయ కమిటీ పిలుపు మేరకు ఇంటింటికీ సీపీఐ ప్రజల వద్దకు సీపీఐ పేరుతో బీజేపీ హటావో.. దేశ్‌కో బచావో అంటూ సీపీఐ నాయకులు, కార్యకర్తలు శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రచారాన్ని ఉద్దేశించి సీపీఐ బాన్సువాడ నియోజకవర్గం ఇంచార్జి దుబాస్ రాములు కోటగిరి మండల కార్యదర్శి ఏవిటల్‌గౌడ్ మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిత్యావసర సరుకులు ధరలను పెంచిందని, వంటగ్యాస్ ధర పెంచిందని, పెట్రోల్ డీజిల్ రేట్లు రోజురోజుకూ పెరుగుతున్నాయని వారు విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం దేశంలోని బడా పెట్టుబడిదారుల కొరకు ఆర్థిక ప్రయోజనాలు కల్పిస్తుందని వారు విమర్శించారు. అనిల్ అంబానీ, గౌతమ్ అంబానీ, నీరవ్‌మోడీ, లలిత్ మోడీల కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పనిచేస్తుందని వారు విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు రేషన్ కార్డులు ఇవ్వాలని, వడగండ్ల వర్షానికి దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం ఇవ్వాలని, తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు. లక్ష రూపాయల రైతు రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయడం సిగ్గుచేటని వారు విమర్శించారు. సద్దులం గ్రామంలో పట్టా పాస్ బుక్కులు ఉన్నవారికి వ్యవసాయ భూమి చూయించాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల నాయకులు నల్ల గంగాధర్, బుడాల రాములు, గ్రామ కార్యదర్శి గోపాల్ రావు, వెంకట్రావు, సాయిలు, లస్మవ్వ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన మల్లికార్జున్‌రెడ్డి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఇనాయత్‌నగర్ గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని బాల్కొండ నియోజకవర్గ బీజేపీ నాయకులు డాక్టర్ ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి శనివారం పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వడ్ల కొనుగోలు కేంద్రంలో క్వింటాలు వడ్లకు 5కిలోల వరకు కడ్తా తీస్తున్నారని, దీంతో సరిపెట్టుకోకుండా నిజామాబాద్‌లోని రైస్‌మిల్లులలో 3 కిలోల వరకు కడ్తా తీస్తామని, లేకపోతే మీ వడ్లను తీసుకోమని రైతులను భయందోళనకు గురిచేస్తున్నారని అన్నారు. రైతుల సమక్షంలో నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు అర్వింద్ ధర్మపురికి ఫోన్ చేసి జరుగుతున్న అన్యాయాన్ని గురించి వివరించారు. దీంతో తక్షణమే స్పందించిన ఎంపీ అరవింద్ నిజామాబాద్ జిల్లా కలెక్టర్‌తో కడ్తా సమస్య గురించి మాట్లాడి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఇకనుంచైనా ఇలాంటి అవకతవకలు జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని కోరారు. వరి కోతలు మొదలై 40 రోజులు గడుస్తున్నా వడ్ల కొనుగోలు ప్రక్రియ నత్తనడకన నడుస్తుందని, కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులని ఆదుకోవాలని మల్లికార్జున్‌రెడ్డి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు కట్ట సంజీవ్, కిసాన్ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు కుంట భూమారెడ్డి, రవి, ప్రశాంత్, శ్రీనివాస్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.